క్లుప్తంగా

బాల వినాయకుడికి గరిక పూజలు



గరిక పూజలో పాల్గొన్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: సంకట హర చతుర్థి సందర్భంగా ఆదివారం భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల వేంకటేశ్వర స్వామి, వినాయక స్వామివారి ఆలయంలో కొలువైన బాల వినాయక స్వామికి గరికలతో పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు చరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు పాల్గొన్నారు.

'ఉక్కు' రిటైర్డ్ అధికారికి సత్కారం



రమణ దంపతులను సత్కరిస్తున్న కార్పొరేటర్ వరలక్ష్మి, నాయకులు

అగనంపూడి: స్టీల్‌ప్లాంట్‌లో ఇటీవల పదవీ విరమణ చేసిన ఎస్ఎంఎస్ విభాగం అధికారి ఎల్.వి.రమణ దంపతులను ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి దంపతులు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానంద శర్మ మాట్లాడుతూ రమణ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉక్కు పరిశ్రమ కార్మిక నాయకులు మోటూరి వెంకటరమణ, అట్ల రామకృష్ణ, కె.పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అవార్డు గ్రహీతకు సత్కారం



ఉమాగాంధీని సత్కరిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన శివాజీపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని ఎం.ఉమా గాంధీని మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందించారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం తరఫున గిడుగు అవార్డుకు ఎంపికై సత్కారం పొందిన మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని ఎ.హైమావతి, విశ్రాంత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుప్పిలి లక్ష్మీవరప్రసాద్‌ను మహిళలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం దుర్గాదేవి, క్లబ్ కార్యదర్శి ఎస్.పుష్పలత, పూర్వ అధ్యక్షులు కె.మాధవి, డి.శిరీష ,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలకు ఆహ్వానం



ఎమ్మెల్సీ వంశీకృష్ణకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న యాదవ సంఘం ప్రతినిధులు

మల్కాపురం: ఈ నెల 7వ తేదీన శ్రీకృష్ణాష్టమి సందర్భంగా మల్కాపురంలో శ్రీవిజ్ఞాన మండలి యాదవ సంఘం ఆధ్వర్యంలో వచ్చే గురువారం నుంచి శనివారం వరకు వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సంఘ కార్యవర్గ ప్రతినిధులు ఆదివారం ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్‌తో పాటు మేయర్ గొలగాని హరివెంకటకుమారి, యాదవ సామాజిక వర్గాని చెందిన పలు వార్డుల కార్పొరేటర్లను ఆహ్వానించారు. శ్రీవిజ్ఞాన మండలి యాదవ సంఘం కార్యవర్గ సభ్యులు, సలహాదారులు పాల్గొన్నారు.

బోధనలో సరికొత్త ఒరవడి

- జిగ్ స్క్రీన్‌లపై అర్థమయ్యేలా టీచింగ్
- తరగతి గదుల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్
- విద్యార్థుల్లో పెరిగిన ఆసక్తి



ఇస్లాంపేట హైస్కూల్‌లో బిగ్ స్క్రీన్‌పై తిలకిస్తూ పాఠాలు నేర్చుకుంటున్న విద్యార్థులు



నడుపూరు హైస్కూల్‌లో డిజిటల్ బోధన సాగిస్తున్న ఉపాధ్యాయుడు

పెదగంట్యాడ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సర్కారీ బడుల్లో బోధన కొత్త పుంతలు తొక్కుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారు. నాడు–నేడు పథకం కింద విద్యాలయాల్లో అత్యాధునిక సదుపాయాలు కల్పించడంతో పాటు సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేలా పాఠశాలల్లో బోధన సాగిస్తున్నారు. చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు. విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో పాటు తరగతి గదుల్లో విజ్ఞానం పెంచేలా బొమ్మలు వేయించి విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందిస్తున్నారు. గ్రీన్ చాక్ బోర్డులు, తాగునీటి ప్లాంట్లు, పలకలతో కూడిన గచ్చులు, పచ్చని చెట్లతో సరస్వతీ నిలయాలను ప్రభుత్వం ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతోంది.

సాంకేతిక ప్రగతితో పరుగులు తీస్తూ..

ప్రస్తుతం సాంకేతిక ప్రగతిని సర్కారీ బడుల్లోని విద్యార్థులకు చేరువ చేసేలా డిజిటల్ తరగతుల నిర్వహణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పాఠాల బోధనకు అవసరమైన పరికరాలను సమకూర్చుతోంది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ) ఏర్పాటు చేసి విద్యార్థులకు దృశ్య, శ్రవణ పద్ధతుల్లో సరికొత్తగా పాఠాలు బోధిస్తున్నారు.

మండలంలోని రెండు పాఠశాలల్లో..

మండలంలో మొత్తం నాలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉండగా.. అందులో నడుపూరు, ఇస్లాంపేట పాఠశాలల్లో డిజిటల్ బోధన సాగిస్తున్నారు. యారాడ, గంగవరం పాఠశాలల్లో నాడు–నేడు పనులు ముగింపు దశలో ఉన్నాయని, త్వరలోనే ఆయా పాఠశాలల్లో కూడా డిజిటల్ తరగతులు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. నడుపూరు పాఠశాలకు 30 ప్యానల్స్, ఇస్లాంపేట పాఠశాలకు 12 ప్యానల్స్‌ను సమకూర్చారు. వీటితో జోరుగా పాఠాలను బోధిస్తు.. విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. వీటి వల్ల విద్యార్థులు సులభంగా పాఠ్యాంశాలను అర్థం చేసుకుంటున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇప్పటికే మండలంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు ఉచితంగా అందజేసింది. స్మార్ట్ టీవీలకు ఇంటర్‌నెట్ అనుసంధానం చేసి ఐఎఫ్‌పీలకు యూట్యూబ్‌ను కనెక్ట్ చేసి పాఠ్యాంశాలను జోరుగా బోధిస్తున్నారు. వీటి ద్వారా క్లిష్టమైన అంశాలను సైతం సులభంగా నేర్చుకుంటున్నారు. విద్యార్థులకు అవసరమైన అంశాలను ఫైల్ రూపంలో సేవ్ చేసుకుని అవసరం ఉన్నపుడు మళ్లీ వాటిని చూడడం, వినడం చేస్తున్నారు. ఈ విధానం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పోటీ పడి ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.



ఇస్లాంపేట హైస్కూల్‌లో ఉర్దూలో డిజిటల్ బోధన సాగిస్తున్న ముజాహిద్దీన్ హక్

ఉత్తమ ఫలితాలు



డిజిటల్ బోధనతో ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉంటుంది. విద్యార్థులు సులభంగా అర్థం చేసుకోవడంతో పాటు ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేసుకుంటున్నారు. అంతే కా కుండా దీని వల్ల విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతోంది. ఈ విధానంతో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బా టలు వేసినట్టే.

– శ్రీనివాస్, రమణాజీ, ఎంఈవోలు

బాగా అర్థం చేసుకుంటున్నాం..



గతంలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు ఇంటికెళ్లి మర్చిపోయే ప్రమాదం ఉండేది. కానీ ఇప్పుడు చూసిన, విన్న పాఠాలు మళ్లీ మళ్లీ చూసుకునే వెసులుబాటు ఉంది. దీని వల్ల పాఠాలను బాగా అర్థం చేసుకుంటున్నాం. పదో తరగతి పరీక్షలో ఉత్తమ ఫలితం సాధిస్తాను.

– పి.తనూశ్రీ, పదో తరగతి, నడుపూరు హైస్కూల్

సులభంగా.. వేగంగా..



డిజిటల్ విధానంలో పాఠాలు బోధిస్తుండడంతో సులభంగా, వేగంగా పాఠాలు నేర్చుకుంటున్నాను. ఏదైనా క్లిష్టమైన, అర్థం కాకపోయినా వెంటనే నివృత్తి చేసుకుంటున్నాను. ఇంటికెళ్లి మరొకసారి దానిని చూసుకోవడంతో మళ్లీ మళ్లీ చదువుకునే పరిస్థితి ఉండడం లేదు. ఈ విద్యా బోధన బాగుంది.

–బషీరున్నీషా, పదో తరగతి, ఇస్లాంపేట హైస్కూల్

అంగన్‌వాడీ పిల్లలకు పోషకాహార కిట్ల పంపిణీ



కిట్ల పంపిణీ కార్యక్రమంలో కార్పొరేటర్ వరలక్ష్మి, లుపిన్ ఫౌండేషన్ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు మంత్రిపాలెంలో లుపిన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అంగన్‌వాడీ పిల్లలకు పోషకాహార కిట్లు అందజేశారు. జాతీయ పోషకార వారోత్సవాల సందర్భంగా లుపిన్ ఫార్మా కంపెనీ సీఎస్సార్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, లుపిన్ హెచ్ఆర్ డీజీఎం ఎస్.శ్రీనివాసరావులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. వరలక్ష్మి మాట్లాడుతూ పోషకాహారం, ఆరోగ్యకరమైన అలవాట్ల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం అవసరమన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలల్లో సంపూర్ణ ఆరోగ్యం కోసం తమ సంస్థ సహకారం అందిస్తోందన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో లలిత కుమారి, లుపిన్ వైద్యాధికారి డాక్టర్ సురేష్‌బాబు, లంకెలపాలెం పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ దివ్యలత తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి ధనరాజు కృషి



వంకా ధనరాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

ఉక్కునగరం: ఉక్కు కార్మికుల మన్ననలు పొందిన నాయకుడు వంకా ధనరాజు అని స్టీల్ సీఐటీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.టి.దాస్, యు.రామస్వామిలు అన్నారు. సీఐటీయూ మాజీ అధ్యక్షుడు ధనరాజు 11వ వర్ధంతి సందర్భంగా ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ధనరాజు కార్మిక సమస్యల పరిష్కారం, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేశారన్నారు. ఏ సమస్యనైనా క్షుణ్ణంగా అధ్యయనం చేసి కార్మికులను సన్నద్ధం చేయడంలో ఆయన పాత్ర కీలకమైనదన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలో కొనసాగేలా సీఐటీయూ తమ వంతు కృషి చేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.ఎస్.మూర్తి, డి.సిహెచ్.వెంకటేశ్వరరావు, రామ్ శేఖర్, కె.ఆర్.కె.రాజు, బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శాకాహార సద్భావన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న పత్రీజీ పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ సభ్యులు

అక్కిరెడ్డిపాలెం: బ్రహ్మర్షి పితామహ పత్రీజీ దివ్య ఆశీస్సులతో పత్రీజీ పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం శాకాహార సద్భావన ర్యాలీ నిర్వహించారు. గాజువాక దిబ్బపానిపాలెం కాలనీలో శ్రీ పరమాత్మ పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకుడు బి.అప్పారావు నేతృత్వంలో జెండా ఊపి ఘనంగా ర్యాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రేవతి దేవి, శివగణేశ్వరరావు, జయలక్ష్మి, సొసైటీ మాస్టర్ వర్మ రాజు, లక్ష్మణరావు, పద్మావతి, బాలాజీ, రామారావు, సుబుధి, అప్పలరాజు, సురేష్, దేవిక, కృష్ణ, జంగమయ్య, లక్ష్మి, పవన సుధ, చినఅప్పారావు, కనకారావు, విష్ణుకుమార్ పాల్గొన్నారు.

శభాష్ వలంటీర్



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న నరసింహకు పింఛన్ ఇస్తున్న వలంటీర్లు

మల్కాపురం: వలంటీర్ వ్యవస్థను కించపరిచే విధంగా మాట్లాడిన వారికి ఈ సేవలు కనువిప్పు కలిగిస్తాయి. యారాడ గ్రామానికి చెందిన నాగోతి నరసింహ అనారోగ్యంతో కేజీహెచ్‌లో కొన్ని రోజుల నుంచి చికిత్స పొందుతున్నాడు. అయితే ప్రతి నెలా రాష్ట్ర ప్రభుత్వం అందించే వైఎస్సార్ పింఛన్ కానుక ఇచ్చే క్రమంలో ఈ నెల కూడా ఆ ప్రాంత వలంటీర్స్ రేణుక, వెంకటేష్ ఈ నెల 1వ తేదీన నరసింహ ఇంటికి వెళ్లారు. ఆయన ఇంటికి తాళం వేసి ఉండడంతో మరుసటి రోజు కూడా వెళ్లారు. తాళం వేసి ఉండడంతో ఆయన ఆస్పత్రిలో ఉన్నారని తెలుసుకుని ఆదివారం వారిద్దరూ కేజీహెచ్‌కు వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న నరసింహకు పింఛన్ అందజేశారు. యారాడ గ్రామం నుంచి వలంటీర్లు సొంత ఖర్చులతో కేజీహెచ్‌కు వెళ్లి పింఛన్ ఇవ్వడంతో వారిని పలువురు అభినందించారు.

షిప్‌యార్డ్ ఉద్యోగుల సమస్యలపై కేంద్ర మంత్రికి వినతి



కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్‌కు సమస్యను వివరిస్తున్న నాయకులు

సింధియా: విశాఖ పర్యటనలో భాగంగా ఆదివారం విశాఖ ఎయిర్‌పోర్ట్‌కు విచ్చేసిన కేంద్ర ఓడరేవుల మరియు షిప్పింగ్‌శాఖ మంత్రి శర్బానంద సోనోవాల్‌ను షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్మికుల సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఉద్యోగ భద్రత కోసం ఎదురుచూస్తున్న షిప్‌యార్డ్ ఎల్ అండ్ ఎం సిరీస్ ఉద్యోగుల వెంటనే పర్మినెంట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలను తెలుసుకున్న కేంద్ర మంత్రి సోనోవాల్, ఎంపీ జీవీఎల్ నరసింహారావు షిప్‌యార్డ్ కార్మికుల సమస్యలపై రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో చర్చిస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తింపు యూనియన్ ప్రతినిధులు తెలిపారు.

దళిత సేన నిరసన



నిరసన తెలుపుతున్న దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు, మహిళలు

కంచరపాలెం: మహిళలపై జరుగుతున్న అకృత్యాల విషయంలో సత్వర స్పందన, నేరస్తులపై కఠిన చర్యలు తీసుకువాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు కోరారు. రాజస్థాన్‌లో ఒక అభాగ్యురాలిపై జరిగిన రాక్షస ఘటనను దళిత సేన తీవ్రంగా ఖండించింది. కంచరపాలెంలోని కార్యాలయం వద్ద దళిత సేన ఆధ్వర్యంలో మహిళలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజస్థాన్ ప్రతాప్‌గాడ్ జిల్లాలో గిరిజన తెగకు చెందిన మహిళపై భర్తతోపాటు కొందరు దారుణ ఘటనకు పాల్పడటం యావత్ దేశానికే సిగ్గుచేటన్నారు. వివాహేతర సంబంధం అనుమానంతో ఆమెను వివస్త్రను చేసి గ్రామస్తులందరూ చూస్తుండగా బహిరంగంగా ఊరేగించడం అవమానకరమన్నారు. మహిళను పూజించే భారతదేశంలో ఇటువంటి సంఘటనలు, అత్యాచారాలు, అవమానాలు జరగడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వాలు స్పందించి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని గొల్లమాల అప్పారావు డిమాండ్ చేశారు. దళిత సేన నగర అధ్యక్షుడు పుచ్చ కామేశ్వరరావు, ఉపాధ్యక్షుడు తాటిపూడి సీతారాం, ప్రధాన కార్యదర్శి చింతల మల్లికార్జునరావు, కోశాధికారి లంకా రామారావు, నగర కన్వీనర్ గొల్లమాల మీన, కార్యదర్శి పట్నాల ఝాన్సీ, రాంజీ అభ్యుదయ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తెలుగుభేరి పుస్తకావిష్కరణ నేడు

మద్దిలపాలెం: ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో తెలుగు భేరి పుస్తకావిష్కరణ కార్య క్రమం జరగనుందని తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు ఫణిశయన సూరి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు హాజరు కానున్నారని పేర్కొన్నారు. తెలుగు పద్యాలు, గేయాల సంకలనంగా రూపొందించిన ఈ పుస్తకాన్ని తెలుగుభాషా పరిరక్షణ దిశగా ఓ అడుగు అని పేర్కొన్నారు. భాషాభిమానులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

గ్లకోమా ప్రమాదకర వ్యాధి



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ జీఆర్‌రెడ్డి

సింహాచలం: గ్లకోమా అనేది కంటి దృష్టిని నిశ్శబ్దంగా హరించే ప్రమాదకరమైన వ్యాధి అని ఏపీ ఆప్తాల్మిక్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ జీఆర్ రెడ్డి తెలిపారు. విశాఖ ఆప్తాల్మిక్ అసోసియేషన్–గ్లకోమా సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో గ్లకోమా ఇండియా ఎడ్యుకేషన్ ప్రొగ్రాం సదస్సు ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ రెడ్డి మాట్లాడుతూ కంటిలో ఏమాత్రం అనారోగ్యం సోకినా వెంటనే కంటి వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. విశాఖ ప్రాంతీయ కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర మాట్లాడుతూ కంటిలో అధిక పీడనం ఏర్పడడం వల్ల గ్లకోమా వ్యాధి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆత్మకూరి విజయకుమార్, జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్, చెన్నైలోని ప్రీమియర్ ఐ కేర్ సర్జికల్ సెంటర్ డాక్టర్ ఎస్ఆర్ రంగరాజ్, ఏపీ మెడికల్ కౌన్సిల్‌కు చెందిన వైద్యులు డాక్టర్ మల్లీశ్వరి పాల్గొన్నారు.

రహదారి భద్రత.. అందరి బాధ్యత



మాట్లాడుతున్న సీఐ భాస్కరరావు

అక్కిరెడ్డిపాలెం: రహదారి భద్రత.. అందరి బాధ్యతని, రోడ్డు ప్రమాదాలకు గురయ్యే కంటే ముందుగానే జాగ్రత్తలు తీసుకునేలా ప్రతీ ఒక్కరిలో అవగాహన పెంచుకోవాలని గాజువాక సీఐ లంకా భాస్కరావు అన్నారు. ఉత్తరాంధ్ర ట్రక్ ఓనర్స్ అండ్ సప్లయర్స్ అసోసియేషన్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం గాజువాక శ్రీనగర్‌లో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐ మాట్లాడుతూ ప్రమాదాలను అరికట్టడం ఏఒక్కరి వల్లో సాధ్యం కాదని, దీనిపై ప్రజల్లో చైతన్యం తేవాలన్నారు. ప్రమాదం జరిగినప్పుడు బాధిత కుటుంబానికి అండగా నిలవాలని సూచించారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సోమేశ్వరరావు, ఎం.జానకీరామిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని గాజువాకలో ట్రక్ టెర్మినల్ ఏర్పాటు అవసరం ఎంతైనా ఉందని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనేక పరిశ్రమలు, వాణిజ్య సంస్థలతో ముడిపడి ఉన్న గాజువాకలో భారీ వాహనాలకు పార్కింగ్ సదుపాయం లేకపోవడం ప్రమాదాలకు కారణమవుతోందన్నారు. ప్రమాదాల నియంత్రణకు తమ వంతు అనేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ట్రక్ టెర్మినల్ ప్రతిపాదనను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా సీఐ భాస్కరరావును జ్ఞాపికతో ట్రాన్స్ పోర్టు ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో విశాఖ గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.సత్యనారాయణ, అరవింద్ కుమార్ మిశ్రా, మిట్టల్ అగర్వాల్, పి.జె.ఆర్.ఎస్.మహారధి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వృత్తి విద్యలో శిక్షణ



ఉపాధి శిక్షణ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మహిళలు

పెదగంట్యాడ: మహిళలు స్వయం సమృద్ధి సాధించేందుకు ఇటువంటి శిక్షణలు దోహదపడతాయని ఎంవీఆర్ గ్రూప్ ఆఫ్ స్మాల్ స్కేల్ యూనిట్స్ ప్రతినిధి మొల్లేటి వెంకటరావు అన్నారు. 65వ వార్డు వాంబే కాలనీలో మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ, ఉపాధి కల్పన కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్ధాంతరంగా చదువులు వదిలేసి, వంటింటికే పరిమితమైన మహిళలు ఇటువంటి శిక్షణ తీసుకుని తద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణలో 25 రకాల వృత్తి విద్యా కోర్సులను నిపుణులతో శిక్షణ ఇవ్వనున్నామన్నారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గొల్లపల్లి రాంబాబు, ప్రసన్న కుమార్, లోకనాథం, నాగిశెట్టి శ్రీను, ఇరోతి గణేష్, కసిరెడ్డి సత్యనారాయణ, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను విరమించుకోవాలి



స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని విరమించుకుని, ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం తక్షణమే ప్రకటించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. కూర్మన్నపాలెం స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 934వ రోజుకు చేరుకున్నాయి. సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులతోపాటు ఏఐటీయూసీ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్రం ఉక్కు పరిశ్రమను అమ్మేస్తానని ప్రకటనలు చేయడం సరికాదన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని దేశ ప్రజలు, కార్మికవర్గం మరీ ముఖ్యంగా స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు భూములిచ్చిన నిర్వాసితులు గట్టి పట్టుదలతో ఉన్నారని, కేంద్రం చేస్తున్న ప్రకటనలను విరమించుకుంటే బాగుంటుందన్నారు. పోరాటం చేయడం రాష్ట్ర ప్రజలకు, ఉక్కు కార్మికులకు కొత్తేమీ కాదని, కేంద్ర ప్రభుత్వం ఎటువంటి కుట్రలు పన్నినా కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామన్నారు. కేంద్రం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

'సామాజిక నిత్య హితోక్తులు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ జీవీఎల్ నరసింహారావు, సాహితీవేత్తలు

సీతంపేట: తెలుగు భాషకు గౌరవం, ఆదరణ పెరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. కళావేదిక వ్యవస్థాపకుడు, డాక్టర్ నందూరి రామకృష్ణ రచించిన 'సామాజిక నిత్య హితోక్తులు 2' అనే పుస్తకాన్ని ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ముఖ్య అతిథిగా ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తెలుగు భాషకు, సాహిత్యానికి ఆదరణ, గౌరవం తగ్గిందని, ప్రభుత్వాలకే కాదు యువతలోనూ లోపించిందన్నారు. తెలుగు భాష దండగ అనే భావన పిల్లల్లోనే కాదు, తల్లిదండ్రుల్లోనూ ఎక్కువగా కనిపిస్తోందని చెప్పారు. ఇంగ్లిష్ నేర్చుకుంటే ఉపయోగం అన్న భావన ప్రస్తుత తరంలో బాగా పెరిగిందన్నారు. ఇది చాలా ప్రమాదకరమైన సూచనగా ప్రతి ఒక్కరూ పరిగణించాలన్నారు. ఇలాగే కొనసాగితే వందేళ్లలో తెలుగు భాష పూర్తిగా ప్రమాదంలో పడుతుందన్నారు. తెలుగు భాషను కాపాడుదాం అన్న ఆలోచనతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న సాహితీవేత్తలు, సంఘాలు పెద్ద ఎత్తున పూనుకోవాలని పిలుపునిచ్చారు. తెలుగు భాష పరిరక్షణకు తన వంతు సాయం అందించడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. తొలి ప్రతిని వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షులు ఎ.హెచ్.ఎన్.వెంకటరావుకు అందజేశారు. ఆచార్య కోలవెన్ను మలయవాసిని పుస్తకాన్ని సమీక్షించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు ఆచార్య కోలవెన్ను విఠల్ మూర్తి, ఆచార్య జె.అప్పారావు, మల్లాది సోమేశ్వరశర్మ పాల్గొన్నారు.

ఏయూ అభివృద్ధి విధానం హర్షణీయం



వీసీ ప్రసాదరెడ్డితో సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సాంకేతికంగా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్న విధానంపై పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఏయూ రసాయన శాస్త్ర విభాగంలో చదువుకున్న 1984–86 బ్యాచ్ పీజీ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఈ బ్యాచ్ విద్యార్థులు విభాగాన్ని సందర్శించి, అభివృద్ధి కార్యక్రమాలను ప్రత్యక్షంగా వీక్షించారు. అనంతరం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏయూ క్యాంపస్‌లో జరుగుతున్న నూతన ప్రాజెక్టులు, కార్యక్రమాలను తాము ఎప్పటికప్పుడు ప్రసార మాధ్యమాలు, స్నేహితుల నుంచి తెలుసుకుంటున్నామని తెలిపారు. భవిష్యత్తుకు అవసరమైన నూతన సాంకేతికతలను చేరువ చేసి నేటి తరం విద్యార్థులకు అందిస్తున్న విధానాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. స్టార్టప్, ఇంక్యుబేషన్ సెంటర్‌ను సందర్శించాలని వీసీ పూర్వ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.